ప్రజాశక్తి

గురువారం 14 డిసెంబర్ 2023



14 నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జిల్లాలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, విజయనగరం మువ్వల లక్ష్మణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, జిల్లా కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. 'విద్యుత్ పొదుపు ఆవశ్యకత మరియు నూతన సాంకేతిక విజ్ఞానం' అంశంపై నిష్ణాతులచే ఇంజినీరింగ్ కాలేజీల్లో వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందజేస్తామని తెలిపారు.

తాడోపేడో తేల్చుకుంటాం



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

- ప్రభుత్వ బెదిరింపులకు లొంగేది లేదు
- తేల్చిచెప్పిన అంగన్వాడీలు
- రెండో రోజుకు సమ్మె
- టిడిపి, జనసేన, ప్రజా సంఘాల నాయకుల మద్దతు

ప్రజశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తేల్చి చెప్పారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడితే తగ్గేదే లేదని హెచ్చరించారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె రెండోరోజుకు చేరింది. బుధవారం కలెక్టరేట్ వద్ద, మండల కేంద్రాల్లోను నిరసన దీక్షలు చేపట్టారు. దీక్షలకు అన్నిచోట్లా టిడిపి, జనసేన పార్టీలతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద దీక్షలను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలునే అంగన్వాడీలు అమలు చేయ మంటున్నారని, ప్రభుత్వం స్పందించలేదు కాబట్టే తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సమస్యలు పరిష్కరించాలని, అలా కాదని ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడితే తగ్గేదే లేదని, గత పాలకులకు పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరించారు. అంగన్‌వాడీలకు మద్దతుగా జనసేన పార్టీ నాయకులు రామచంద్ర రాజు, ఆదాడ మోహన్‌రావు, ఎఐఎఫ్‌టియు, ఇఫ్టూ, ఐద్వా, డివైఎఫ్ ఐ జిల్లా, రాష్ట్ర నాయకులు బెహరా శంకర్రావు, అప్పలసూరి, రవణమ్మ, లక్ష్మి, సుధారాణి, రుద్ర ప్రసాదులు మాట్లాడారు. వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు బి పైడిరాజు మాట్లాడుతూ ఐసిడిఎస్ రక్షణ కోసం, ఉద్యోగ భద్రత కోసం తాము చేస్తున్న పోరాటాన్ని బలపరిచిన ప్రజా సంఘాలకు, రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభ, విశాలాక్షి, శివలక్ష్మి ,మంగ లక్ష్మి, ప్రసన్న, జయ, లలిత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు టిడిపి, జనసేన నాయకుల మద్దతు

గజపతినగరం : సమ్మెలో భాగంగా స్థానిక జాతీయ రహదారి పక్కన కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన దీక్షకు టిడిపి మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కరణం శివరామకృష్ణ, జనసేన నాయకులు జి.నారాయణరావు, గౌరీశంకర్, ఎస్.లక్ష్మణ్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కెఎ నాయుడు మాట్లాడుతూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మె చాలా న్యాయమైనదని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా మోసం చేస్తుందని తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో టిడిపి నాయకులు బండారు బాలాజీ, మిత్తిరెడ్డి వెంకట రమణ, గుండ్రోతు గోవిందు, పివి గోపాల రాజు. వేమలి చైతన్య బాబు, అట్టాడ లక్ష్మంనాయుడు, మరుపల్లి, రామన్నపేట సర్పంచులు లెంక లక్ష్మి, రుంకాణ అరుణ, లెంక సత్యనారాయణ, మజ్జి గోవిందరావు, కర్రి సత్యనారాయణ, కరుమజ్జి కృష్ణ పాల్గొన్నారు కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న మద్దతు

బొబ్బిలి : ఐసిడిఎస్‌ను బలోపేతం చేసి అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు మద్దతు పెరుగుతుంది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఎన్టీఆర్ విగ్రహం జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. సమ్మెకు ఇఫ్టూ జిల్లా నాయకులు ఎం.గోపాలం, వి.రామ్మూర్తి, ఏపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల, కామేశ్వరి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని రెండోరోజు అంగన్వాడీ సమ్మె కొనసాగింది. సిఐటియు నాయకులు సురేష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రవణమ్మ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

కొత్తవలస: రెండో రోజు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షకు గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, సిపిఐ నాయకులు డేగల అప్పలరాజు, గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం నాయకులు, అంగన్వాడి నాయకులు కాకర తులసి, రెడ్డి శంకరావతి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడితే అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించి సంఘీభావం తెలపాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రంలో రెండో రోజు కొనసాగుతున్న అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని పార్టీ స్థానిక నేతలతో కలిసి సందర్శించి మద్దతు ప్రకటించారు. సిఐటియు మండల కార్యదర్శి బలసా శ్రీను, కాంగ్రెస్ నాయకులు పద్మావతి, వాకా తిరుపతి రావు, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

గరివిడి: చీపురుపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ విసినిగిరి శ్రీనివాసరావు బుదవారం ఉదయం గరివిడి తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న ధర్నాకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గం సీనియర్ జనసేన నాయకులు సిగ తవిటి నాయుడు, సింహాచలం, వీరమహిళ జమ్ము జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని లేనిచో మరింత పెద్ద ఎత్తున దీక్షలు చేయాల్సి వస్తుందని సిఐటియు జిల్లా నాయకులు టివి రమణ, అంబళ్ల గౌరినాయుడు అన్నారు. మండల కేంద్రంలో గత రెండు రోజులుగా అంగన్వాడీ కార్యకర్తల చేపట్టిన దీక్షలో బుధవారం వారు పాల్గొని మాట్లాడారు.

గంట్యాడ : ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అనసూయ ఆధ్వర్యాన సమ్మె కొనసాగుతోంది.



గజపతినగరం : నిరసనలో పాల్గొన్న టిడిపి, జనసేన నాయకులు



బొబ్బిలి : నిరసన దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు



మెరకముడిదాం : అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న టివి రమణ



బాడంగి : ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణతకు

100 రోజుల విద్యా ప్రణాళిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతిలో శతశాతం ఉతీర్ణత సాధించే దిశగా జిల్లా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు తయారు చేసిన వంద రోజుల కార్యాచరణను జిల్లా విద్యా శాఖాధికారి బి. లింగేశ్వర రెడ్డి బుధవారం మీడియాకు వివరించారు. అనుభవజ్ఞులైన ప్రధానోపాధ్యా యులు, సబ్జెక్టు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో 100రోజుల ప్రణాళికను రాష్ట్రస్థాయిలో అత్యున్నత మార్కులు, శత శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో తయారు చేసినట్లు తెలిపారు.

2023-24 విద్యా సంవత్సరంలో ఎస్ఎ-1 కు ముందు నాలుగు సెల్ఫ్ టెస్టులు, ఒక ప్రీ ఎస్ ఎ-1 నిర్వహించారు. దానికి కొనసాగింపుగా వందరోజుల ప్రణాళికలో మూడు సెల్ఫ్ టెస్టులు, మూడు గ్రాండ్ టెస్ట్‌లు, ఒక సెల్ఫ్ ప్రీ ఫైనల్ టెస్ట్ ఉంటుంది. వీటిని డిసిఇవి ద్వారా ముద్రించి పాఠశాలకు సరఫరా చేస్తారు. ఎక్కువమంది పిల్లలు 500 మార్కులు మించి సాధించేందుకు, శత శాతం ఫలితాలు సాధించేందుకు వీలుగా గత ప్రశ్నా పత్రాలను విశ్లేషించి ఇప్పటి మోడల్ కనుగుణంగా సెల్ఫ్ ప్రశ్న పత్రాలను తయారు చేశారు. ఈ ప్రణాళిక రోజువారీగా సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు ఆయా అంశాలను/కాన్సెప్ట్ ను బోధించడం, చదివించడం, సెల్ఫ్ పరీక్ష నిర్వహించుకునే విధంగా తయారు చేశారు. సరైన ఫలితాలు వచ్చే విధంగా ఈ ప్రణాళికను అమలు పర్చేందుకు ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు క్రింది సూచనలు పాటించాల్సి ఉంది.

ఇవీ సూచనలు

- తల్లిదండ్రులు, విద్యార్థులతో ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసి 100 రోజుల ప్రణాళిక అమలు ప్రాధాన్యతను వివరిస్తూ వారిని సంసిద్ధం చేయాలి.
- ప్రతి సెల్ఫ్ పరీక్ష నిర్వహించిన వెంటనే దాన్ని వాల్యూ చేసి విద్యార్థులకు ఇచ్చి వారు చేసిన తప్పులను వివరించి నోట్స్‌లో కరెక్ట్ సమాధానాలు రాసి పూర్తిస్థాయిలో వచ్చేవరకు ప్రాక్టీస్ చేయించాలి.
- ప్రతి సెల్ఫ్ టెస్టు పూర్తయిన తర్వాత అన్ని సబ్జెక్టుల్లో ఫలితాలను విశ్లేషించి ఉపాధ్యాయులతో రివ్యూ మీటింగ్ నిర్వహించడం, ఫలితాలు తక్కువ వచ్చిన సబ్జెక్టు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తదుపరి కార్యాచరణ తయారు చేసి అమలు పరచడం.
- ప్రతి విద్యార్థికి, తల్లిదండ్రులకు తెలియజేసేందుకు విద్యార్థి ఇంటిని సందర్శించాలి. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో చేపట్టాలి.
- విద్యార్థులను ఉపాధ్యాయులకు దత్తత ఇచ్చి వారి ప్రగతి గురించి మాట్లాడిస్తూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడానికి తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలి.
- ఎంఇఒలు మండల పరిధిలో, ఉప విద్యా శాఖ అధికారులు వారి డివిజన్ పరిధిలో ఈ ప్రణాళిక సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షణ చేసి, 15రోజులకొకసారి డిఇఒకు నివేదిక ఇవ్వాలి.
- ఈ కార్యక్రమం 160 రోజులలో (100 రోజుల ప్రత్యేక ప్రణాళిక) ఒక సబ్జక్ట్ కు 12 సెల్ఫ్ టెస్ట్‌లు చొప్పున, 7 సజ్జెక్టులకు మొత్తంగా 84 సెల్ఫ్ టెస్ట్ లు నిర్వహిస్తారు.

సిసిఎస్ సిఐగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిఐగా ఆత్మకూరి సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సిసిఎస్‌లో పని చేసిన ఎం.బుచ్చిరాజును అనకాపల్లి జిల్లా అచ్చుతాపురం అర్బన్ పోలీసు స్టేషనుకు ఇటీవల విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ బదిలీ చేశారు. ఆయన స్థానంలో జి.మాడుగుల సిఐగా పనిచేస్తున్న ఆత్మకూరి సత్యనారాయణను నియమించారు. సత్యనారాయణ 2004 బ్యాచ్ ఎస్ఐ గా పోలీసుశాఖలో చేరారు. 2021లో ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ ఉన్నతి పొందారు. బాధ్యతలు చేపట్టిన తరువాత సిఐ సత్యనారాయణ ఎస్‌పి ఎం.దీపికను, ఎఎస్‌పి అస్మా ఫర్హీన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

స్థానిక తోట పాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాల గ్రౌండ్స్‌లో కోచ్ కె. సంతోష్ అధ్వర్యంలోలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఇటీవల విశాఖపట్నం లో జరిగిన జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ మేయర్ కప్ - 2023 లో పాల్గొని అనేక పతకాలు సాధించారు. వాటిలో ఎస్. శ్రీకాంత్, పి. హేమంత్ కాటా- కుంటీ లో బంగారు పతకాలు, బి.యోచన కాటాలో బంగారు పతకం, కుంటీలో రజిత పతకం, ఎం. హర్ష వర్ధన్, కాటా లో బంగారు పతకం, కుంటీ లో కాంస్య పతకం, కె.శివ గణేష్, కాటాలో బంగారు పతకం, కుంటీలో కాంస్య పతకం, బి.హస్వంత్, కాటాలో రజిత పతకం, కుంటీలో రజిత పతకం, జి. తిరుమల రజిత పతకం సాధించారు. వీరంతా ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతులు మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వీరిని సత్య డిగ్రీ కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం. సత్య వేణి, జిల్లా కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సంతోష్ విద్యార్థులను అభినందించారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి, విజయనగరం కోట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా భోగాపురం మండలం పోలిపల్లి లో ఈనెల 20న నిర్వహించే భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని రాష్ట్ర పార్టీ పరిశీలకులు అమర్నాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అధ్యక్షతన నియోజకవర్గ ఇన్‌ఛార్జిల సమావేశం జరిగింది. సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడు, కోండ్రు మురళీమోహన్, అదితి గజపతి రాజు , కర్రోతు బంగార్రాజు , మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు , రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ , జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఐ.వి.పి. రాజు , పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

డొమిస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్స్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. బుధవారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ నైపుణ్య కేంద్రంలో రెండు నెలల శిక్షణకు దరఖాస్తులు కోరుచున్నట్లు తెలిపారు. అభ్యర్థుల వయసు 18 సంవత్సరాల నుంచి 28 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్య అర్హత ధ్రువపత్రాలతో పాటుగా ఆధార్ కార్డు, రెండు ఫోటోలతో ఈనెల 16వ తేదీ లోపు https//forms.gle/ vKUYDKj9DzyaHY2T అనే లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7780658035 గల నెంబర్ కు సంప్రదించాలని కోరారు.

15న పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తోటపాలెం సబ్ స్టేషన్‌లో లోడులను సవరించేందుకు కొత్తగా ఏర్పాటు చేయబోయే 11కెవి బ్రేకర్, లైన్ల పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఇఇ పి.హరి తెలిపారు. 33/11 కెవి తోటపాలెం సబ్ స్టేషన్ లో గల 11కెవి ఫీడర్లు మీద గల పలు ప్రదేశాలకు విద్యుత్ నిలుపుదల చేస్తామన్నారు. సెంట్రల్ బ్యాంక్, ట్యాంక్ బండ్ , తోటపాలెం రామాలయం, బ్యాంక్ కాలనీ, శ్రీనివాస కాలేజీ , మయూరి జంక్షన్, బాలాజీ నగర్, వెంకటేశ్వర స్వామి గుడి, నాయుడు కాలనీ, నరసింహనగర్ , నాయుడు కాలనీ, కళ్యాణ్ నగర్ మరియు ఇతర ప్రదేశాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

5న ఓటర్ల తుది జాబితా : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-విజయనగరం

మార్పులు, చేర్పుల అనంతరం ఓటర్ల తుది జాబితా జనవరి 5 న వెలువడుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డి అనిత చెప్పారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇఆర్‌ఒలతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్షించారు. పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వివిధ దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 9తో గడువు ముగిసిందని చెప్పారు. వాటి పరిశీలన ఈ నెల 26నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. మార్పులు, చేర్పుల అనంతరం 5వ తేదీన తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. అర్హత ఉన్న వారు ఓటు హక్కు పొందేందుకు మాత్రం ఫారం 6 ను నేరుగా గానీ, ఆన్లైన్ లో గానీ ఇప్పుడు కూడా ఇవ్వ వచ్చునని, ఈప్రక్రియ నిరంతరం కొనసాగు తుందని తెలిపారు. వాటిని పరిశీలించి, నామినేషన్లకు పది రోజుల ముందు ప్రచురించే అనుబంధ జాబితాలో చేర్చుతారని తెలిపారు. పేర్ల తొలగింపునకు సంభందించి, ఇప్పటికే సంభందిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఇఆర్‌ఒలు వెంకటేశ్వర్రావు, సుదర్శన దొర, నూకరాజు, సుధారాణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాల్సిందే

నేడు, రేపు కలెక్టరేట్ ఎదుట 'ఆశా'ల వంటావార్పు ● 36 గంటలపాటు నిరవధిక ధర్నాకు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వెట్టిచాకిరీ చేయించుకుంటున్న 'ఆశా'లకు పనిభారం తగ్గించి వేతనం పెంచాలని ఈ నెల 14, 15వ తేదీల్లో కలెక్టరేట్ ఎదుట వంటావార్పుతో నిరవధిక ధర్నాకు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. ఈ మేరకు జిల్లాలోని ఆశావర్కర్లంతా నిరవధిక ధర్నాకు కదులుతున్నారు. ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి, ఆయా పిహెచ్ సి, అర్బన్ హెల్త్ సెంటర్ అధికారులకు ఆశా వర్కర్లు వినతి పత్రాలు ఇచ్చి ధర్నాకు వెళ్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 2400 మంది ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. వీరంతా రెండు రోజులపాటు చేపట్టే 36 గంటల ధర్నాలో పాల్గొననున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశాలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ నాయకులు కోరడంతోపాటు 36 గంటల ధర్నాకు కలెక్టరేట్ ఎదుట ఏర్పాట్లు చేస్తున్నారు. వెట్టిచాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం ఆశా వర్కర్లు సమస్యలు పరిష్కరించడంలో, కనీస వేతనాలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరవధిక ధర్నాలో ఆశా వర్కర్లంతా పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.




వైద్యులతో కలిసి ఫీవర్ సర్వే చేస్తున్న ఆశా వర్కర్ (ఫైల్)

ఇవీ డిమాండ్లు

- కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్చాలి.
- పనిభారం తగ్గించాలి. ఆన్లైన్, రికార్డు పని ఒకే సారి చేయించాలి.
- రూ.10లక్షల గ్రూప్ ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలి.
- ప్రభుత్వ సెలవులు, మెడికల్, మెటర్నిటీ లీవ్ ఇవ్వాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఇళ్ల స్థలం, ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.
- మరణించిన వారి కుటుంబంలో అర్హులైన వారికి ఆశాలుగా తీసుకోవాలి.
- కనీస వేతనం చెల్లించాలి. ఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాలలో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



అనేక ఏళ్లుగా ఆశా వర్కర్లు గా పని చేస్తున్న మాకు సరైన గుర్తింపు లేదు. ఉద్యోగ భద్రత కరువైంది. అన్ని రకాల పనులు మాతో చేయించుకుంటున్న ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఉద్యోగ భద్రత,కనీస వేతనాలు అమలు చేసే వరకు ఉద్యమం కొనసాగుతుంది. ఆశా వర్కర్లు కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలి.

ఎల్.శాంతమ్మ,
ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం



ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఈనెల 14, 15 తేదీల్లో కలెక్టరేట్ వద్ద 36 గంటల నిరవధిక ధర్నా, వంటావార్పు కార్యక్రమాలు చేస్తున్నాం. ఆశ వర్కర్స్‌కు పని భారం పెరగడం వల్ల అనేకమంది హార్ట్ ఎటాక్ వచ్చి అనారోగ్యం పాలై చనిపోతున్నారు. వీరికి గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని యూనియన్‌గా అనేకమార్లు ధర్నాలు చేసాం. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు, కాబట్టి రేపు ధర్నా చేయాలని నిర్ణయించాం.

- బి.సుధారాణి,
ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



వినతి పత్రాన్నిస్తున్న పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికుల జీతాలు పెంచాలి

గజపతినగరం: పంచాయతీ కార్మికులకు పెరిగిన ధరలకనుగుణంగా జీతాలు పెంచాలని కోరుతూ బుధవారం గజపతినగరం, పురిటిపెంట సచివాలయం కార్యదర్శి జనార్దనకి కార్మికులు వినతి పత్రం ఇచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోలు, విద్యా, వైద్యం, అన్ని ధరలూ పెరగడం వల్ల కుటుంబ భారాన్ని మోయడం చాలా కష్టంగా ఉందన్నారు. 2021 ఆగస్టు 27 తేదీ నుండి సెప్టెంబరు రెండు వరకు ఆరు రోజులపాటు సమ్మె చేసిన సందర్భంగా 1500 జీతం పెంచారని గుర్తు చేశారు. 2021 ఏప్రిల్ నుండి ఏరియర్స్‌తో ఇచ్చారు. ఆ జీతాలు పెంచి మూడు సంవత్సరాలు కావస్తుంది. కావున వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి. లక్ష్మి, పంచాయతీ కార్మిక నాయకులు నాగేశ్వరరావు, కనకరాజు, కృష్ణ, గోవిందు, కోటి తదితరులు పాల్గొన్నారు.

బంగార్రాజుకు మత్స్యకారుల సన్మానం

భోగాపురం: బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు ఆర్థిక సహాయం అందించడం మర్చిపోలేమని మత్స్యకారులు అన్నారు. ఇటీవలే విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో బోట్లు కాలిపోవడంతో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు టిడిపి పార్టీ తరుపున తన సొంత సొమ్ము రూ.10 లక్షలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా బాధిత మత్స్యకారులు కొంతమంది బుధవారం బంగార్రాజును పోలిపల్లి స్వగృహంలో కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి సింహాచలం, క్లస్టర్ ఇంచార్జి దంగా భూలోక, ఎంపిటిసి బాబాజీ, టిడిపి నాయకులు బడి నూకరాజు, బర్రి నూకరాజు, మైలపల్లి ఎల్లాజీ, గరికిన రాము, గరగయ్య, అరజల్ల నరసింహ, దానయ్య, కొమర రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లు అన్యాయం

బొబ్బిలి: మున్సిపాలిటీలో ఉద్యోగాలు కోసం నిరుద్యోగుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడడం అన్యాయమని సిపిఎం నాయకులు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. మున్సిపాలిటీలో కాంట్రాక్టు ఉద్యోగాల కోసం అధికార పార్టీకి చెందిన కొంతమంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఒక్కో ఉద్యోగానికి రూ.6లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించి అక్రమ వసూళ్లను ఆపాలని, ఏజెన్సీలో ఉద్యోగులను నూతనంగా నియమిస్తున్నారు, ఏ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ముగింపు సభను విజయవంతం చేయాలి

బొండపల్లి: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ కోరారు. బుధవారం గజపతినగరంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోకేష్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువగళం పాదయాత్రకు ఈ నెల 20న భోగాపురంలోని పోలిపల్లి వద్ద ముగింపు సభతో ముగియనుందని ఈ సభకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు రంకాణం అరుణ, లెంక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యం పై డిప్యూటీ డిఇఒ ఆరా

రేగిడి: మండలంలోని వెంకట రంగారాయపురం, కొత్త వలస పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా సామర్థ్యంపై ఉపవిద్యాశాఖాధికారి బ్రహ్మాజీ బుధవారం ఆరా తీశారు. విద్యార్థుల విద్యా ప్రగతి, బోధనపై ఉపాధ్యాయ పాత్రను పోషించి పాఠాలు బోధించారు. తరగతుల వారి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీలను, లెసన్ ప్లానును, విద్యార్థుల వర్కు బుక్కులను, ఈ వర్క్ బుక్కులను ఉపాధ్యాయులు సరి చేసే తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏసేబు, చల్లపల్లి మురళి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలపై బుధవారం సచివాలయ, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి సత్యవంతుడు మాట్లాడుతూ ఈ క్రీడల్లో ఎక్కువ మంది పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా కిట్లను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్‌డి ఉమా, మండల పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఆలీ, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమావేశం

వేపాడ: మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి పి. బాలభాస్కరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సంబంధించిన అటెండెన్స్, సిలబస్, వర్క్‌బుక్స్, నోట్ బుక్స్ పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్స్, మధ్యాహ్నం భోజన నిర్వహణ, ఎస్ఎ-1 మార్కు అంశాలపై చర్చించారు.

ఎంఇఒకు సమ్మె నోటీసు

మండల విద్యాశాఖ కార్యాలయంలోని ఎంఇఒకు ఈ నెల 16వ తేదీ నుండి పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీసును అందజేశారు. ఈనెల 16న తలపెట్టిన కార్యక్రమంతో పాటు ఈనెల 20వ తేదీ నుండి చేపట్టనున్న సమ్మెకు కూడా పూర్తి మద్దతు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలను కోరారు.

ఫ్లెక్సీలు చించివేతపై పోలీసులకు ఫిర్యాదు

భోగాపురం: జాతీయ రహదారిలో భోగాపురం సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించివేయడం పై భోగాపురం జనసేన పార్టీ నాయకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల నాదెండ్ల మనోహర్ పర్యటన సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని వాటిని కొంతమంది వ్యక్తులు చింపివేసారని చించి వేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని ఆ పార్టీకి చెందిన పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, బొల్లు త్రినాథ్ ఎస్.ఐ కృష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుర్ల: ఎస్ఎస్ఆర్‌పేట వద్ద బస్సు, మోటారు సైకిల్ ఢీకొన్న సంఘటనలో గుజ్జంగివలస గ్రామానికి చెందిన కొర్లాన అప్పన్న గాయపడ్డారు. అప్పన్న మోటారు సైకిల్ పై విజయనగరం వెళుతుండగా ఎస్ఎస్ఆర్ పేట సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సు ఢీ కొంది. స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనం ద్వారా విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లోకేష్‌ను కలిసిన చైతన్యబాబు

విజయనగరం కోట: పాయకరావుపేటలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను బుధవారం విజయనగరం పార్లమెంట్ తెలుగుయువత అధ్యక్షులు వేమలి చైతన్య బాబు జిల్లా యువత నాయకులతో పాటు కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో తెలుగుయువత ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమాలను వివరించారు. యువత సమస్యలపై మరింత పోరాడాలని ముఖ్యంగా నిరుద్యోగులకు అండగా నిలవాలని లోకేష్ సూచించారు.

హెచ్ఐవిపై ఖైదీలకు అవగాహన

విజయనగరం: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కార్యక్రమంలో భాగంగా విజయనగరం సబ్ జైలులో ఉన్న వారికి 'హెచ్ఐవి/ఎయిడ్స్ సుఖవ్యాధుల'పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి. బాలాజీ పాల్గొని 'హెచ్ఐవి/ఎయిడ్స్' తమ జీవితంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి.దేవి, ఎన్ఎస్ఎం రమణ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాక్సింగ్ పోటీలు

విజయనగరం టౌన్: 65వ రాష్ట్ర బాక్సింగ్ స్కూల్ గేమ్స్ పోటీలు బుధవారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్14,17,19 విభాగాలలో ఐదు కేటగిరీల్లో జరిగిన పోటీల్లో 62 మంది క్రీడాకారులు మొదటి,ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు వైసిపి యువజన విభాగం నాయకులు జి.ఈశ్వర్ కౌశిక్ బహుమతులు ప్రదానం చేశారు. బాలికల డివిజన్ జనవరిలో జరిగే జాతీయ పోటీలలోను, బాలుర డిసెంబర్ 23 నుండి మహారాష్ట్రలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె.సూరిబాబు, పిఇటిలు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొంటాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

రైతు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొంటామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బలిఘట్టం రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రైతు కూడా తన పంటని కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి మోసాలకు తావు లేకుండా, రైతు భరోసా కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా కూడా పని చేస్తాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చు అన్నారు. తుఫాను కారణంగా తడిచిన పంటని ఎండపెట్టి నూరుపు వేయాలని, పండించిన ప్రతి గింజనీ, రంగుమారిన కూడ ప్రభుత్వం కొనగోలు చేస్తుందని, స్థానిక నాయకులు ప్రజా ప్రతినిధులు కలిసి రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి ఎల్ విజయ, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, స్థానిక నాయకులు ఆదిరెడ్డి అప్పన్న (బలిఘట్టం నాయుడు), ఎల్.కోట జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, సచివాలయం కన్వీనర్ లెంక వెంకన్న పాత్రుడు, రైతులు పాల్గొన్నారు.



కొత్తవలస: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

బాడంగి: మండలంలోని రేజేరు ఆర్‌బికె వద్ద బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయాధికారి శిరీష, వైస్ ఎంపిపి బొమ్మినాయని రమేష్, పార్టీ మండల అధ్యక్షులు బొమ్మినాయని వెంకటనాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని ఆర్‌బికెల వద్ద కొనుగోలు చేసే విధంగా నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్ర సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్ రైతుల వద్ద ఉన్న ధాన్యం నుండి శాంపిల్ సేకరించి తేమ శాతం, ఇతర నాణ్యత ప్రమాణాలు పరీక్షిస్తారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ జిపిఎస్ వాహనం ద్వారా రవాణా చార్జీలు, హమాలీ, గోనె సంచులకు నగదు చెల్లెంచేలా ఆన్‌లైన్ చేసి ట్రక్ షీట్ జారీ అయ్యేలా చేసి రైతుకు ఎఫ్‌టిఒ కాపీ అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ బి. అప్పలనాయుడు, విఎఎ వాడాడ సాయికుమార్, ధాన్యం కొనుగోలు సిబ్బంది వి. హేమలత, బి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలసలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలన్న ఉద్దేశంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తుంది ప్రభుత్వం అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇప్పటికే అధికార్లంతా పంట నష్టం అంచనాలును వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి రమేష్, నాయకులు జనార్దన్, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు, ఇజ్జురోతు ఈశ్వర్రావు, ఎఒ నీలిమ తదితర పాల్గొన్నారు.

గంట్యాడ: వరి పంటకు సంబంధించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తాదని ఎంపిపి పీరు బండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం, లెక్కిడాం ఆర్‌బికెలలో కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. రైతులు భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని చెప్పారు. మండలంలోని అన్ని ఆర్‌బికెల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వరి నరసింహమూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు లచ్చిరెడ్డి కృష్ణ, ఎస్‌సి సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, రంది రాము నాయుడు, రైతులు పాల్గొన్నారు.



రామభద్రపురం: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజ పారదర్శకంగా కొనుగోలు చేయాలని ధాన్యానికి గిట్టబాటు ధర కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎస్‌వి చినఅప్పలనాయుడు తెలిపారు. బుధవారం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో కొట్టక్కి పిఎసిఎస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు మద్దతు ధర కల్పనే ధ్యేయంగా ఆర్‌బికెల ద్వారా ధాన్యం సేకరణ చేస్తున్నామని అక్కడ టెక్నికల్ సిబ్బంది రైతు ముంగిటే ధాన్యాన్ని పరిశీలించి వారు ఏర్పాటు చేసిన సంచుల ద్వారా ధాన్యం మిల్లులకు ఎప్పుడు తరలించేది వివరించి రసీదు అందజేస్తారని చెప్పారు. ఈ కార్య క్రమంలో జెడ్‌పిటిసి సరస్వతి, వైసిపి మండల అధ్యక్షులు లక్ష్మంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు సత్యనారాయణ, ఎంపిటిసి రవణమ్మ, తహశీల్దార్ సులోచనారాణి, ఎఒ వెంకటయ్య, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని చల్లవానితోటలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పాటు ఎపికి జగనే మళ్లీ ఎందుకు కావాలి కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అన్నదానిపై గ్రామస్థులుతో మాట్లాడారు. వారి సమస్యలను విన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి లంచాలు లేకుండా, కులాలు చూడకుండా, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అతన్ని మరోసారి సిఎంను చేసుకుంటేనే సంక్షేమ పథకాలు నేరుగా మీ ఇంటికి వాలంటీర్లు ద్వారా చేరుతాయని గుర్తు చేశారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి రమేష్, నాయకులు జనార్దన్, కుమిలి సొసైటీ అధ్యక్షులు పతివాడ శ్రీను, స్థానిక సర్పంచ్ వరలక్ష్మి, ఎంపిడిఒ రాధిక, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని వినతి

విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు సిఐటియు ఆధ్వర్యంలో వి అర్ఎలు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ మాట్లాడుతూ విఆర్ఎలకు పే స్కేల్ జీతాలు, డివి బకాయిలు చెల్లింపుతో పాటు బిఎల్ డ్యూటీల నుండి విఆర్ఎలను మినహాయించాలని తదితర సమస్యల పరిష్కారం చేయాలని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - భోగాపురం

మిచౌంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి విజయనగరం పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు అన్నారు. మండలంలోని గుడివాడ గ్రామంలోని పంట పొలాలను నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బంగార్రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిశీలకులు ఎల్.ఎల్ నాయుడు, గంట్యాడ మాజీ జెడ్‌పిటిసి రమేష్ కుమార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి దాసరి అప్పలస్వామి, రాంజీ పాల్గొన్నారు.

రైతును ఆదుకోవాలి: సిపిఐ

నెల్లిమర్ల: తుపాను వల్ల నష్ట పోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ నాయకులు బుగత అశోక్ డిమాండ్ చేశారు. బుదవారం సిపిఐ ఆధ్వర్యంలో రైతులకు న్యాయం చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు టి. సన్ని బాబు, ఎం. పాపారావు తదితరులు పాల్గొన్నారు.



భోగాపురం: పంటను పరిశీలిస్తున్న కర్రోతు

రేగిడి: రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నారు జనార్ధనరావు డిమాండ్ చేశారు. బుధవారం సంకిలి సచివాలయం వద్ద రైతులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్ర రైతు సంఘం నాయకులు అప్పల నాయుడు, నియోజకవర్గం రైతు సంఘం నాయకులు పాలవలస రామినాయుడు రైతులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో విలేకర్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి- మెరకముడిదాం

సమాజాభివృద్ధిలో విలేకర్ల పాత్ర కీలకమని సమాజం అభి వృద్ధి పథంలో నడవాలంటే అందులో ఉన్న లోటు పాట్లను పాలకులకు తెలియ చేసి అందరికి మంచి చేకూర్చుటలో విలేకర్లు ముందుంటారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్మించి ప్రెస్‌క్లబ్‌ను మండల నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు ఎవరైనా సరే పార్టీలతో సంబంధం లేకుండా ప్రజల సమస్యలే ఎజెండాగా చూస్తూ నిరంతరం వారి సమస్యలను ప్రజా పాలకులకు, అధికారులకు గుర్తు చేస్తూ పని చేస్తున్న ప్రెస్ మిత్రులందరికీ ఎపుడు మంచి చేయాలనే ఉద్దేశంతో మీకు ఎళ్ల వేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి తాడ్డి వేణుగోపాలరావు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, వైసిపి మండల అధ్యక్షులు కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ఉద్యోగులపై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పురపాలక సంఘం ఉద్యోగులపై దాడి చేయడం దుర్మార్గమని ఎపి మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం విశాఖ రీజియన్ ఉపాధ్యక్షులు వైఎస్‌సిహెచ్ పాపయ్య రాజు అన్నారు. పిడుగురాళ్ల పురపాలక సంఘంలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ ఉద్యోగుల పై కొందరు నాయకులు దాడి చేసి గాయపర్చిన చర్యను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయం కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడింది ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాయపడ్డవారి కాంప్లెయింట్ పై తక్షణమే తగుచర్య తీసుకోవాలని కోరారు. ఇలాంటి దాడులను ముక్త ఖంఠంతో ఖండిస్తూ, పిడుగురాళ్ల మునిసిపల్ ఉద్యోగుల పోరాటంలో నెల్లిమర్ల నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు కలసినడుస్తూ మద్దతు తెలియచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

శ్రీకాకుళం టు హైదరాబాదుకు

ఒకే లారీలో 54 ఆవులు తరలింపు

●వాహనాల తనిఖీలో పట్టుబడిన లారీ ●గోశాలకు తరలిస్తుండగా లారీలో మంటలు ●క్షేమంగా మరో లారీలో ఎక్కించిన పోలీసులు

ప్రజాశక్తి - భోగాపురం

ఒకే లారీలో సుమారు 50కి పైగా ఆవులను ఎక్కించి శ్రీకాకుళం నుంచి హైదరాబాదుకు తరలిస్తున్నారు. ఇంతలో భోగాపురం సి.ఐ బీవి వెంకటేశ్వరరావు మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ లారీ పట్టుబడింది. ఈ లారీని విశాఖ పట్నంలోని పెందుర్తి వద్దనున్న గోశాలకు బుధవారం తరలిస్తుండగా సుందరపేట జంక్షను వద్దకు వచ్చేసరికి లారీలో మంటలు చెలరేగడంతో వెంటనే నిలుపదల చేసి మంటలను ఆర్పి మరో వాహనంలో ఎక్కిస్తుండగా అందులో ఉన్న ఆవుల సంఖ్యను చూస్తే అక్కడ ఉన్నవారికి మతిపోయింది. ఒకటి కాదు రెండు కాదు రెండు వరుసల్లో ఒకదానిపై ఒకటి ఎక్కించి 54 ఆవులను ఒకే లారీలో తరలించే ప్రయత్నం చేశారు.

శ్రీకాకుళం జిల్లాల్లో వివిధ సంతల్లో కొంతమంది వ్యాపారులు ఆవులను కొనుగోలు చేశారు. ఇలా సుమారు 50కి పైగా ఆవులను హైదరాబాదు తరలించేందుకు లారీలో ఎక్కించారు. వీటిని మంగళ వారం రాత్రి తరలిస్తున్నారు. ఇంతలో పూసపాటిరేగ మండలం అగ్రహారం వద్ద భోగాపురం సి.ఐ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ లారీ పట్టుబడింది.



వేరే లారీలోకి ఆవులను ఎక్కిస్తున్న కూలీలు

గోశాలకు తరలిస్తుండగా లారీలో మంటలు

పట్టుబడిన ఆవులను పెందుర్తి వద్దనున్న గోశాలకు పోలీసులు తరలిస్తుండగా సుందరపేట జంక్షను సమీపంలో లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చెలరేగిన మంటలను వెంటనే ఆర్పివేశారు. ఈ ఆవులను మరో లారీని తీసుకువచ్చి అందులోకి ఎక్కించారు. అప్పుడు లారీ డోర్‌ను ఓపెన్ చేసి చూసిన పోలీసులు అవాక్కయ్యారు. ఒకేలారీలో రెండు వరసల్లో ఒక ఆవుపై మరో ఆవును ఎక్కించి నిర్వాహకులు తరలిస్తున్న తీరు కనిపించింది. ఇలా ఒకదానిపై ఒకటి లోపికి కుక్కేయడం వల్ల కొన్ని ఆవులు కూడా లారీలోనే చనిపోయినట్లు తెలుస్తోంది.

కేసు నమోదు: సిఐ

వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆవులను తరలిస్తున్న లారీ పట్టుబడింది. ఆవులను తరలిస్తున్న వారితో పాటు కొనుగోలు చేసిన వ్యాపారిపై కేసులు నమోదు చేయమని పూసపాటిరేగ ఎస్ఐకి చెప్పాం. ఆవులను అనుమతులు ఉన్న గోశాలకు పంపించమని ఆదేశించామని సిఐ బివి వెంకటేశ్వరరావు తెలిపారు.

అరుదైన గ్రూపు రక్తం దానం

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన సాధన యువజన సంఘం సభ్యులు అరుదైన ఏ నెగిటివ్ రక్తాన్ని దానం చేశారు. బుదవారం విశాఖ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎస్. అజిత్ బాబు అనే పేషంట్ కు అరుదైన రక్త వర్గం ఏ నెగిటివ్ 2యూనిట్ల అవసరం కావడం తో పేషంట్ బందువులు సాధన అధ్యక్షులు పోలుభోతు దుర్గాప్రసాద్‌కి సమాచారం ఇచ్చారు. ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ ఇంఛార్జి నాగేశ్వరరావు ద్వారా శిలానగర్‌కి చెందిన బి.ఆదిత్య అనే వ్యక్తి స్పందించి వెంటనే కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌కి వచ్చి లైవ్ ఎస్‌డిపిని డొనేట్ చేశారు. కె.లక్కీ అనే వ్యక్తి కూడా స్పందించి మొత్తం రక్తం డొనేట్ చేశారు. సకాలంలో స్పందించిన రక్త దాతల కు సాధన అధ్యక్షులు దుర్గాప్రసాద్, ఎన్ వి ఎన్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిది నాగేశ్వరరావు, రోగి బందువులు కృతజ్ఞతలు తెలిపారు.

బొత్సను కలిసిన కోలగట్ల

ప్రజాశక్తి- విజయనగరంటౌన్

ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకొని పూర్తిగా కోలుకొని విజయవాడ చేరుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

సిఎం మారితే పథకాలు ఆగిపోతాయ్

ప్రజాశక్తి - వేపాడ

సిఎం మారిపోతే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని అందుకే మరోసారి సిఎం జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాటూరులో బుధవారం జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గుబాబు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకటరావు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం. కస్తూరి, కోపరేటివ్ ప్రెసిడెంట్ రామునాయుడు, సోంపురం సర్పంచ్ గంగరాజు, నాయకులు దుల్లా మహేష్, గంగునాయుడు, ఎంపిడిఒ పట్నాయక్, ఇఒపిఆర్‌డి ఉమా, పంచాయతీ కార్యదర్శి సంధ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారథులు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో గల 15వ సచివాలయం పరిధిలో బుధవారం ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించి సంక్షేమం అందించాలంటే మళ్లీ జగనే సిఎం కావాలన్నారు. అనంతరం సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడగంజి రమేష్ నాయుడు, పట్టణ జెసియస్ కన్వీనర్ రెజేటీ ఈశ్వర్ రావు (విస్సు), 4వ వార్డు కౌన్సిలర్ పందిరిపల్లి అమ్మనమ్మ, మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్, రెవెన్యూ ఆఫీసర్ ప్రసాద్, టిపిఆర్ఒ జగన్మోహన్, సచివాలయం కన్వీనర్లు తూముల రాణి, కాసా వేణు గోపాల్, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



వేపాడ: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే


వైభవంగా గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాదిలో గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీధులలో గౌరీ పరమేశ్వరులను బ్యాండ్ మేళాలతోనూ, కాంగో డాన్సులు, జానపద ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు భారీ మందు గుండు సామగ్రి కాల్పులతో పురవీధులలో ఊరేగించారు. నేటికీ ఐదు సంవత్సరాలుగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. ఈ ఉత్సవాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ దంపతులు, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి దంపతులు పాల్గొని గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన రేలారేరేలా కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని గౌరీ పరమేశ్వరుల కమిటీ, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు దంపతులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.



ఉత్సవాల్లో పాల్గొన్న గొంప కృష్ణ, కోళ్ల లలితకుమారి తదితరులు



మొక్కులు తీర్చుకుంటున్న గొంప వెంకటరావు దంపతులు